

టీడీపీ ప్రచారంలో ఉద్యోగులు

కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ స్వామి భక్తిని చాటుకుంటునారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
రాయచోటి	6.30	5.02
రాజంపేట	6.30	5.02
పీలేరు	6.33	4.58
మదనపల్లె	6.32	5.05

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 30 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	445	445
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 52.320 కిలోలు

న్యూస్‌రీల్

హెల్త్ ప్రొవైడర్ల వివరాల నమోదు తప్పనిసరి

రాయచోటి అర్బన్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో హెల్త్ ప్రొవైడర్ల వివరాల నమోదు తప్పనిసరి అని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, డెంటల్ ఆప్తాల్మిక్ క్లినిక్స్, ఫిజియోథెరపీ సెంటర్‌లు తదితరాలలో సేవలు అందించే వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారిపై కఠినచర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

రెండో రోజు 741 మంది గైర్హాజరు

రాయచోటి టౌన్: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం రెండవ రోజున అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 129 సెంటర్ల ద్వారా ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సెంటర్ల ద్వారా 22,767 మంది హాజరు కావాల్సి ఉండగా 741 మంది హాజరు కాలేదని అధికారులు తెలిపారు. అలాగే నలుగురు (ఎక్జిమిటెడ్) మినహాయింపు పొందినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారని వివరించారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: కెనరా బ్యాంక్ సౌజన్యంతో గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంక్ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 -45 ఏళ్ల లోపు వారు దీనికి అర్హులని తెలిపారు. శిక్షణ తరగతులు ఈనెల 20 నుంచి ప్రారంభం అవుతాయని తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో నేరుగా ఉమ్మడి కడపలోని కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ వద్దకు వెళ్లి తమపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచితంగా బస ఏర్పాటుతో పాటు భోజన వసతి కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాల కోసం 9440905478/9985606866లకు ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దేవునికడప ఆలయ సిబ్బంది వేతనాల పెంపు

కడప కల్చరల్: దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ సిబ్బంది వేతనాలు పెంచారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో టీటీడీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా దేవదాయశాఖ పరిధిలో ఉండిన దేవుని కడప ఆలయాన్ని 2006లో తిరుమల-తిరుపతి దేవస్థానాల పరిధిలోకి తీసుకున్నారు. ఒకరిద్దరు అర్చకులు మినహా మిగతా అర్చకులు, సహాయ అర్చకులు, ఇతర సిబ్బందికి తాత్కాలిక వేతనాలు చెల్లించేవారు. ఈ విషయంగా అర్చకుల సంఘాలు, టీటీడీ అధికారులను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన టీటీడీ ఉన్నతాధికారులు సిబ్బందికి వేతనాలు పెంచారు. ఇందులో నెలకు రూ. 5 వేలకు పనిచేసే వారికి రూ. 15 వేలు, రూ. 10 వేలతో పనిచేసే వారికి రూ. 20 వేలు, రూ. 15 వేలతో పనిచేసే వారికి రూ. 25 వేలు చొప్పున ఆలయ సిబ్బందికి ఈ వేతనాలు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. దేవునికడప ఆలయంలో వేద పండితులు, అర్చకులు, సహాయకులు, పరిచారకులు, పోటు కార్యాలయ సిబ్బంది తదితర సిబ్బంది మొత్తం 28 మందికి వేతనాల పెంపు వర్తించనుంది. మార్చి మాసం నుంచి ఈ వేతనాలు వర్తించే అవకాశం ఉంది. జీతాలు పెంచడం పట్ల ఆనందంగా ఉందని అర్చకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్లమెంట్‌లో ప్రసంగించిన విద్యార్థులకు ఘన సత్కారం

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు మిద్దె రూప, ఎస్. సానియాలు భారత యూత్ పార్లమెంట్‌లో పాల్గొని ఉపన్యసించడం పట్ల వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఎం. మణికంఠ విచ్చేసి మిద్దె రూప, సానియాలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థిని మిద్దెరూప 2022 అక్టోబర్ 2న పార్లమెంట్‌లో చక్కగా ప్రసంగించిందని, తాజాగా 2024 మార్చి 5,6 తేదీల్లో కళాశాల పూర్వ విద్యార్థిని సయ్యద్ సానియా యూత్ పార్లమెంట్‌లో చక్కగా ఉపన్యసించిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆమె ఓటే.. గెలుపుబాట!





ఓట్ల పండుగకు తెర తీయడంతో అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. రాజకీయ క్షేత్రంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ పరీక్షల్లో నెగ్గాలంటే 'ఆమె' ఓటే కీలకం కానుంది. సార్వత్రిక సమరంలో బరిలోకి దిగే నేతల భవితవ్యం ఇప్పుడామె చేతుల్లోనే ఉంది. అవును... ఆమె ఎటు ఓటు వేస్తే.. విజయం అటు వైపే తూగుతుంది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మహిళల ఓట్లే అధికంగా ఉండడం విశేషం.



- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళల ఓట్లే అధికం
- నేతల తలరాత 'ఆమె' చేతుల్లోనే



రాజంపేట: సార్వత్రిక సమరానికి పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటనతో ఓట్ల పండుగకు తెర లేచింది. ఈ క్రమంలో ఓటర్ల మనసులు గెలుచుకునేందుకు అభ్యర్థులు తమ అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా మహిళల ఓట్ల కోసమే ఆశగా చూస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సార్వత్రిక సమరంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు వనితకు వందనం చేస్తూ తమకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. నేతల తలరాత మార్చే పాశుపతాస్త్రం ఇప్పుడు మహిళ చేతిలో ఉంది. మరి మగువ మద్దతు ఎవరికి దక్కుతుందో ఫలితాల వరకు ఆగాల్సిందే.

మహిళల ఓటర్లు 7,12,326

జిల్లాలో మొత్తం 14,02,808 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళ ఓటర్లు 7,12,326 మంది ఉన్నారు. సగానికి పైగా మహిళా ఓటర్ల సంఖ్య ఉండడం విశేషం.

అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో..

జిల్లాలో రాజంపేట, రాయచోటి, కోడూరు,తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలు ఉన్నాయి. అసెంబ్లీ సెగ్మెంట్లలో మహిళ ఓటర్ల హవా కొనసాగుతోంది. గతంతో పోలిస్తే ఈ సారి మహిళా ఓటర్లు గణనీయంగా పెరిగారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో మహిళ ఓటర్లు అధికంగా ఉండటంతో.. వారిని ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయపార్టీలు అడుగులు వేస్తున్నాయి.

మహిళ ఓటర్ల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	ఓటర్లు
రాజంపేట	1,21,424
కోడూరు(ఎస్సీ)	1,02,176
రాయచోటి	1,25,512
తంబళ్లపల్లె	1,12,418
పీలేరు	1,18,397
మదనపల్లె	1,32,399

ఓటర్లు: 14,02,808

అసెంబ్లీ సెగ్మెంట్లు: 6

ఓటర్లు: 7,12,326

నిబంధనలు కట్టుదిట్టంగా అమలు

కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. మంగళవారం సాయంత్రం విజయవాడలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, వాణిజ్య స్థలాల్లో రాజకీయ ప్రకటనలు, గోడరాతలు, జెండాలు, పోస్టర్లు, పెద్దపెద్ద హోర్డింగ్స్, కటౌట్స్, తొలగింపులకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అలాగే స్టాటిక్స్ సర్వైవలెన్స్ టీమ్‌ల పని తీరు, పోలింగ్ పర్సన్స్ రాండమైజేషన్, డైరన్, ప్రథమ శిక్షణ, ఈవీఎంల మొదటి, రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ, సీవిజిల్ యాప్ ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలలో జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ముఖ్య అన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫిరెన్సు ద్వారా సమీక్షించారు. పలు అంశాలలో దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ రావు వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగసంస్థల ప్రాంగణాల్లో, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నూతన అనుమతులను ఏమాత్రం ఇవ్వరాదన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని బోర్డర్ చెక్ పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా తగు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపరచడం, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంను విస్తృత స్థాయిలో వినియోగించాలని తెలిపారు. సీవిజిల్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణం స్పందించి సకాలంలో పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో వివిధ ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన రెడ్యం



ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

మైదుకూరు: టీడీపీ ఆవిర్భావం నుంచి 42 ఏళ్ల పాటు నిజాయితీతో, నిబద్ధతతో పనిచేసిన రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని చంద్రబాబు అవమానించారని, తాము మనస్ఫూర్తిగా.. గౌరవంగా వైఎస్సార్‌సీపీలోకి ఆయనను ఆహ్వానించామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మైదుకూరులోని డీసీఎల్ ఫంక్షన్ హాల్‌లో వేలాది మంది అనుచరులతో టీడీపీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు ఆయన సోదరులు కేసీ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రెడ్యం ఆదినారాయణరెడ్డి, దువ్వూరు మండలం గుడిపాడు మాజీ సర్పంచ్ తుమ్మల కొండారెడ్డి తదితరులకు ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో ఆయనకు, అనుచరులకు సముచిత గౌరవం ఉంటుందని పేర్కొన్నారు.

27న ప్రొద్దుటూరులో బస్సు యాత్ర



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 27న ఇడుపులపాయ నుంచి ఇచ్చాపురం వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 27న ఇడుపులపాయలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం బస్సు యాత్ర ప్రొద్దుటూరుకు చేరుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ప్రొద్దుటూరులో తొలి సభను సీఎం జగన్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాలు మినహా 21 రోజుల పాటు బస్సు యాత్ర సాగుతుందని తెలిపారు. తొలి రోజు బహిరంగ సభ ప్రొద్దుటూరులో నిర్వహించాలని సీఎం నిర్ణయించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. కడప పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి ఈ సభకు లక్ష మంది హాజరవుతారని ఎమ్మెల్యే వివరించారు. సభ నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్నామని, నేడో.. రేపో ఆ వివరాలను వెల్లడిస్తామన్నారు.

రైల్వే ఎస్‌ఐకి సేవా పతకం



జగన్‌మోహన్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: రైల్వేశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకం వరించింది. విధి నిర్వహణలో ఏకాగ్రత, క్రమశిక్షణ, స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన ఎస్‌ఐ సేవలను గుర్తించి సేవా పతకానికి ఎంపిక చేశారు. 1989లో కడపలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం రైల్వే ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆగస్టు 15న జగన్‌మోహన్‌రెడ్డిఈ సేవా పతకాన్ని గుంతకల్లు రైల్వే ఎస్పీ చేతుల మీదుగా అందుకోనున్నారు. సేవా పతకం పొందిన ఎస్‌ఐకి సహచర ఉద్యోగులతోపాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైవీయూ ఎల్‌ఎల్‌బీ పరీక్ష తేదీల్లో మార్పు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 23వ తేదీన నిర్వహించాల్సిన 3, 5 సంవత్సరాల న్యాయ(ఎల్‌ఎల్‌బీ) పరీక్షలు 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ మార్పు చేశామని, విద్యార్థులు గమనించాలని సూచించారు. మిగిలిన పరీక్షలు యాధావిధిగా జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

బడి.. బాగుపడింది!




కార్పొరేట్ హంగులతో రూపుదిద్దుకున్న ముదివేడు ఎంపీ మోడల్ ప్రైమరీ పాఠశాల

నాడు.. గుండీలు ఊడిన చొక్కాలు.. జారిపోయే నిక్కర్లు.. చేతిలో పలక ఉంటే జేబులో బలపం ఉండదు.. మొన్నటివరకు ప్రభుత్వ పాఠశాలలకెళ్లే పేద పిల్లల పరిస్థితి ఇది. ఇక పాఠశాలల పరిస్థితీ ఇంచుమించు ఇంతే. పెచ్చులూడే పైకప్పులు.. వర్షానికి ఉరిసే గదులు.. చెట్ల కింద చదువులు.. ఇక వానొస్తే సెలవే అన్నట్లు ఉండేది. రంగులు వెలిసిపోయి.. బూజు పట్టిన గోడలతో దుర్భరంగా ఉండేవి.

నేడు.. చక్కని యూనిఫాం.. మెడకు టై.. కాళ్లకు బూట్లు..అవసరమైన పిల్లలకు కంటి అద్దాలు.. పుస్తకాలు.. నోటు బుక్కులు.. ఇదీ నేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆహార్యం. ఇక ఆర్చి మొదలు తరగతి గది దాకా పాఠశాలలు కొత్త సొబగులు అద్దుకున్నాయి. రంగు రంగుల బల్లలు.. ఇంగ్లీషు ల్యాబులు.. స్వచ్ఛమైన మంచి నీటి కుళాయిలు.. శుభ్రమైన మరుగుదొడ్లు. స్మార్ట్ టీవీలతో బోధన, విద్యార్థులకు సరిపడా ఫర్నీచర్‌తో కళకళలాడుతున్నాయి.

- నాడు-నేడుతో మారిన రూపురేఖలు
- తొలి దశలో 605 పాఠశాలల్లో రూ.148 కోట్లు
- రెండో విడత 1037 పాఠశాలల్లో రూ.341 కోట్లతో అభివృద్ధి పనులు



మదనపల్లె సిటీ: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మారాయి. కార్పొరేట్‌ను తలదన్నేలా మౌళిక వసుతులు సమకూరాయి. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే నాడు-నేడు పథకం కింద పాఠశాలల రూపు రేఖలను సమూలంగా మార్చారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వసతులు కల్పించారు. పిల్లల చదువుకు కావాల్సిన వస్తువులను విద్యాకానుక పేరుతో అందిస్తున్నారు. పిల్లలు చదువులో రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న గోరుముద్ద పేరుతో పౌష్టికాహారం అందిస్తున్నారు. రోజుకో మెనూతో పాటు కోడిగుడ్లు, రాగిజావ, చిక్కీ అందజేస్తున్నారు. దీంతో పిల్లలు ఆడుతూ పాడుతూ పాఠశాల మెట్లెక్కి సంతోషంగా విద్యనభ్యసిస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా మొదటి విడత కింద 605 పాఠశాలలను రూ. 148 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండవ విడత కింద 1037 పాఠశాలల్లో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. వాటిలో నాడు-నేడు కింద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్‌షెడ్డు, ఇంగ్లిష్ ల్యాబ్ తదితర పనులు చేస్తున్నారు. ఇందుకోసం రూ.341 కోట్లు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటికే దాదాపు పనులు పూర్తి కావచ్చాయి.

ప్రత్యేక బృందంతో పనుల నిర్వహణ

జిల్లాలో జరుగుతున్న నాడు-నేడు రెండో విడత పనులకు సంబంధించిన ప్రొగ్రెస్‌పై సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశారు. టీమ్ సభ్యులు పాఠశాలల్లో పనులు ఎలా జరుగుతున్నాయి, వారికి కావాల్సిన మెటీరియల్‌ను సకాలంలో అందించడంతో పాటు ప్రొగ్రెస్ ఎలా ఉంది.. ఎక్కడైనా పనుల్లో వెనుకబడి ఉంటే ఎందుకు వెనుకబడిందని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం కొత్తగా నాడు-నేడు 2 ఏ, బీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.





నాడు-నేడుతో రూపురేఖలు మారిన మదనపల్లె మండలం చీకలబైలు ప్రభుత్వ పాఠశాల, డిజిటల్ బోర్డు ద్వారా పాఠాల బోధన

క్లుప్తంగా

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

లక్కిరెడ్డిపల్లి : భార్యను హతమార్చిన కేసులో నిందితుడు యోగానందరెడ్డిని అరెస్టు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కుర్నూతల గ్రామం బొమ్మేపల్లికి చెందిన రమణమ్మ (32)ను తన భర్త యోగానందరెడ్డి గొంతు నులిమి హత్యచేశారు. ఈ మేరకు యోగానందరెడ్డిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామసముద్రం : కర్ణాటక మద్యం అక్రమంగా విక్రయిస్తున్న నిందితున్ని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ సద్గురు, ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. పుంగనూరు మండలం అలజనేరు గ్రామానికి చెందిన మారప్పగారి సుబ్రమణ్యం (32) కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా 768 మద్యం ప్యాకెట్లను తీసుకొచ్చి, కుదురుచీమనపల్లె పంచాయతీ జోగిండ్లు గ్రామం వెంకటప్ప పొలంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ, ఎస్ఐ సిబ్బందితో వెళ్లి సోదాలు జరిపి రూ.58 వేల రూపాయల విలువైన కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితున్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

మూడు ట్రాక్టర్లకు జరిమానా

అట్లూరు : మండల పరిధిలోని సగిలేరు సమీపాన రికార్డులు సక్రమంగా లేకుండా అక్రమంగా తిరుగుతున్న మూడు ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు స్థానిక ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు



కలికిరిలో కిషోర్‌కుమార్‌రెడ్డి భార్య తనూజరెడ్డితో కలసి ఎన్నికల ప్రచారంలో జేఎన్‌టీయూ ల్యాబ్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



కిషోర్‌కుమార్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచారంలో ఉన్న పోస్టుమాస్టర్ కమలనాథ

పీలేరు : కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. పీలేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రచారంలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగులు కొందరు దర్శనమిస్తున్నారు. టీడీపీ నేత నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డితోపాటు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇలాంటి వారిలో గుర్రంకొండ మండలం మర్రిపాడు సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ శ్రీరాములు, కలకడ మండలం కదిరాయచెరువు బ్రాంచ్ పోస్టు మాస్టర్ కమలనాథ, కలికిరి జేఎన్‌టీయూ ల్యాబ్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కలకడ మండలం నడిమిచెర్లలో వెటర్నరీ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న శివ ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైనా నిబంధనలు తుంగలో తొక్కి బరితెగించి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వీరిపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'జహా' జిమ్మిక్కులు..!

- అసంతృప్తులను వదిలేసి ప్రత్యర్థులతో మంతనాలు
- మొహమాటపెట్టి మరీ కండువాలు, ఫొటోలు
- మద్దతు తెలపకున్నా.. తనతోనే ఉన్నారనేలా ప్రచారం

మదనపల్లె : ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది పెద్దల సామెత. అయితే మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా(జహా) దీనికి భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా సీటు దక్కించుకున్న ఆయన, ఆయా పార్టీల్లోని అసంతృప్త నేతలు తనకు వ్యతిరేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి, వేరుకుంపట్లకు సిద్ధమవుతున్నా... ఇవేవీ పట్టనట్లు జిమ్మిక్కులను నమ్ముకుని ముందుకెళుతున్నారు. గతంలో తనకున్న వ్యక్తిగత పరిచయాలతో.. ప్రత్యర్థి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను ఇరుకున పెడుతున్నారు. వారికి ఇష్టం లేకున్నా, కలిసేందుకు సుముఖత చూపకపోయినా, నేరుగా మందీమార్బలంతో వారి ఇంటికి వెళ్లి, శాలువా కప్పి అభినందించడం, పుష్ప గుచ్ఛం అందించడం చేస్తూ, వెంట తీసుకెళ్లిన వ్యక్తిగత మీడియా ముందు.. తనకు మద్దతు తెలిపారని, తన వెంట నడుస్తామని చెప్పారని అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారు. తీరా ఆయన వెళ్లాక.. ఇదేమిటని సదరు నాయకులు, ప్రజాప్రతినిధులను అడిగితే... చెప్పా పెట్టకుండా నేరుగా ఇంటికి వచ్చి మొహమాటపెడితే.. పొమ్మని చెప్పలేక, శాలువా కప్పించుకుని, ఫొటోలకు పోజులివ్వాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. దీనిపై టీడీపీ, బీజేపీ, జనసేన అసంతృప్త నాయకులు స్పందిస్తూ.. షాజహాన్‌బాషాకు తామెవ్వరూ సహకరించమన్న విషయం అర్థమై.. ప్రత్యర్థి పార్టీలోని నాయకులను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఓ మైనారిటీ టీడీపీ నాయకుడు చెప్పుకొచ్చాడు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేలోపు ఇంకెన్ని సిత్రాలు చూడాల్సి వస్తుందోనని రాజకీయ విశ్లేషకులు పెదవి విరిచారు.



కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతిని సన్మానిస్తున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

ఏటిలో పడి.. అపస్మారక స్థితిలోకి వెళ్లి..

నిమ్మనపల్లె : మద్యం మత్తులో బాహుదా ఏటిని దాటుతూ, నీటిలో పడి ఓ వ్యక్తి అపస్మారకస్థితికి వెళ్లిన ఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అగ్రహారం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన ఐ.రెడ్డెప్ప(50) వ్యవసాయం చేస్తూ పశువులను మేపుకొంటూ జీవిస్తున్నాడు. నాటు సారాకు అలవాటు పడి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం చింతపర్తివారిపల్లెలో సారా తాగి, తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో బాహుదా ఏటిని దాటుతూ, నీటిలో ఓవైపుగా పడిపోయాడు. ఉదయం ఏటివద్దకు వెళ్లిన మరోవ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడ్ని 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ఏటినీటిలో పడి ఉన్న రెడ్డెప్ప

జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నిమ్మనపల్లె పంచాయతీ మద్దిరెడ్డిపల్లె సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని ఆయన పేర్కొన్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,050 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. దాడిలో హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, సిబ్బంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు

పెద్దమండ్యం : విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఏఎస్ఐ ఎం.రెడ్డెప్పనాయక్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో మంగళవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎస్ఐ రెడ్డెప్పనాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సోమవారం పోలీసులు మదనపల్లెకు తరలించిన విషయం తెలిసిందే. ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన మృతదేహాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన స్వగ్రామమైన ఎస్‌వోపల్లె తండాలో కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతితో తండాలో విషాదం నెలకొంది. ఆయన కుటుంబ సభ్యులను పోలీసు అధికారులు పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చెన్నకేశవ, ఏఎస్ఐ మధుసూధనాచారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎస్ఐ మృతదేహానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు : ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ యువకుడిని బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి కుమారుడు జస్వంత్‌రెడ్డి (17) ద్విచక్ర వాహనంలో టమాట పైరును పొలం వద్ద ఉన్న కూలీలకు ఇచ్చేసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. సెంట్రల్ స్కూల్ ఎదురుగా బొలేరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో జస్వంత్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ తిప్పేస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన జస్వంత్‌రెడ్డి

జల్సాల కోసం బైక్ చోరీలు

- నిందితులంతా 20 ఏళ్ల లోపు యువకులే
- రూ.8 లక్షల 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం

మదనపల్లె : జల్సాలకు అలవాటు పడ్డ యువకులు, ముఠాగా ఏర్పడి డబ్బు కోసం బైక్ చోరీలను ఎంచుకుని, చివరకు పోలీసులకు చిక్కారు. నిందితులంతా 20 ఏళ్లలోపు యువకులైతే, వారిలో ఒకరు మైనర్ బాలుడు కావడం శోచనీయం. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ యువరాజు వివరాలు వెల్లడించారు. పలమనేరుకు చెందిన సయ్యద్ జావీద్ (20), షేక్ ముజంబిల్ అలియాస్ ముజ్జు (19), వీరితో పాటుగా మరో మైనర్‌బాలుడు చికెన్ షాపులో పని చేస్తుంటారు. వీరి స్నేహితుడు పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్ (20) పెయింటింగ్ పని చేస్తుంటాడు. వీరు అన్నమయ్య జిల్లా పీటీఎం మండలం ఎగువపల్లెకు చెందిన టూవీలర్ మెకానిక్ కనుమపల్లె బాలు (21)తో కలిసి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసే వారు. చోరీ చేసిన వాహనాలను అనంతపురం జిల్లాకు తీసుకెళ్లి విక్రయించి, వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ జీవించేవారు. ఈ క్రమంలో ఈ నెల 4న టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రామారావుకాలనీలోని దాదాపీర్‌కు చెందిన రూ.1.90 లక్షల విలువ చేసే రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ చోరీ జరిగింది. చోరీపై దాదాపీర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా ఎస్ఐలు ఇనాయతుల్లా, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు బృందాలను నియమించారు. వీరు బైక్ చోరీ నిందితులను గుర్తించి, కొండామర్రిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లె బైపాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే 1 రాయల్ ఎన్‌ఫీల్డ్, 2 హీరో స్ప్లెండర్ ప్లస్, 1 హోండా ఆక్టివా, 2 హోండా డియోలను స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు వాహనాలు, టూటౌన్ స్టేషన్ పరిధిలో రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై గతంలో కేసులు లేవని, నేరచరిత్ర లేకపోయినా, జల్సాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడ్డారని సీఐ యువరాజు చెప్పారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ శంకర, కానిస్టేబుల్ ప్రసాద్, భద్ర, శివ, సిద్ధేశ్వర, రెడ్డిశేఖర్‌లను సీఐ అభినందించారు.



బైక్ చోరీ నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ యువరాజు

దేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమైక్యత సమగ్రతకు నష్టం కలిగించే సీఏఏను రద్దు చేసే వరకు పోరాడాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం 2019లో పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమోదింప చేసుకున్న 'పౌరసత్వ సవరణ చట్టం' (సీఏఏ) ఆనాటి ప్రజా ఉద్యమాల ధాటికి తాత్కాలికంగా అమలు చేయలేకపోయిందన్నారు. తర్వాత ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఆ చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి, ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, మతకలహాలు సృష్టించి అధికారమే ధ్యేయంగా హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు, నరమేధానికి తెగబడుతున్నదన్నారు. బీజేపీ ఇంతకాలంగా ప్రయత్నిస్తున్న హిందూత్వ వ్యవస్థను ఏర్పాటు చేయడానికే ఈ ప్రయత్నం అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగం మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తుందన్నారు. రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 16, 25లను ఉల్లంఘిస్తుందన్నారు. ముస్లింలు అధికంగా వున్న పొరుగు దేశాలలో పీడనకు గురవుతూ, శరణార్థులుగా వచ్చిన వారిని కాపాడేందుకు ఈ చట్టం తెచ్చామని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తోందన్నారు. శ్రీలంక, బూటాన్, మయన్మార్‌లో పీడనకు గురవుతూ శరణార్థులుగా వస్తున్న వారికి ఎందుకు రక్షణ కల్పించటం లేదని ప్రశ్నించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వటం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు ఎన్. వెంకటశివ, రామ్మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, వీరశేఖర్, అన్వేష్, కేసీ బాదుల్లా, బి. మనోహర్, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి, గంగా సురేష్, శివకుమార్, వలరాజు, చిన్ని, మునయ్య, భాగ్యలక్ష్మి, శంకర్ నాయక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు లింగారెడ్డి సుబ్బరామిరెడ్డి(35) మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. సోమవారం ఉదయం వేంపల్లె మండలం పాములూరు గుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయిన సుబ్బరామిరెడ్డిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు తలకు బలమైన గాయాలయ్యాయని బతకడం కష్టమని తెలపడంతో కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కూడా ఎటువంటి లాభం లేదని తెలపడంతో చేసేదేమీ లేక వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుసిరెడ్డిపల్లెకు తీసుకువచ్చారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకొన్న రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు అనూరాధ, కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి తదితరులు మృతదేహంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

కడప అర్బన్ : విభిన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద వారి అర్హతలను పొందేందుకు, వివిధ లక్ష్య సమూహాలకు సహాయం అందించడానికి ఎన్జీవోలతో మంగళవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాసదన్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ విభిన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివిధ సమూహాలకు అందేలా ఎన్జీవోలు అవగాహన, చైతన్యం కలిగించాలన్నారు. వివిధ ఎన్జీఓలు వారి కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్జీవోల పాత్ర సమాజంలో కీలకమన్నారు. అన్ని వర్గాల పట్ల అవగాహన కలిగించి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. ఉచిత న్యాయసహాయం, లోకాయుక్త గురించి వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శాంత, ఎన్జీవోలు పాల్గొన్నారు.



ఎన్జీవోలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

పంచసూత్రాలు పాటించి ప్రమాదాలు నివారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ప్రతి డ్రైవర్ పంచసూత్రాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు తనవంతుగా కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప ఆర్‌ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఓంశాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప అక్కయ్య డ్రైవర్లచే ధ్యానం చేయించారు. చివరగా తక్కువ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు డిప్యూటీ సీఎంఈ లక్ష్మీభాస్కర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు డిపోలకు చెందిన 17 మంది డ్రైవర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

విమాన సేవలకు ప్రభుత్వ సాయం

- 'సీమ' వాసులకు మరో ఏడాది చౌక విమానయానం
- వీజీఎఫ్ సాయం పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం
- కడప–హైదరబాదు సర్వీసుకు రూ.12 కోట్ల రాయితీ
- కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి సర్వీసులు నడిపేందుకు రూ.33 కోట్లు



కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయలసీమ ప్రజలు మరో ఏడాది పాటు చౌక చార్జీలతో విమాన ప్రయాణాన్ని సాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. వయబులిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) పథకాన్ని మరో ఏడాది పొడిగించడం వల్ల ప్రజలకు ఈ అవకాశం అందుబాటులోకి వచ్చింది. కడప–హైదరాబాదు మధ్య సర్వీసు నడిచేందుకు రూ.12 కోట్లు, కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్టు నుంచి బెంగుళూరు, చెన్నై, విశాఖపట్టణంలకు సర్వీసులు నడిచేందుకు వీలుగా రూ.33 కోట్లను ఇంటర్ గ్లోబ్ ఏవీయేషన్ లిమిటెడ్ (ఇండిగో) సంస్థకు కేటాయించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎయిర్ పోర్ట్స్) డిపార్టుమెంటు ద్వారా ఈ సాయం అందించనుంది. ఇందుకు సంబంధించి జీఓ ఆర్‌టీ నెంబరు 23ను ప్రభుత్వం ఇటీవల జారీ చేసింది.

ప్రభుత్వ నిర్ణయం వల్ల మరో ఏడాది చౌక ధరలతో కడప–హైదరాబాదు మధ్య ప్రయాణించేందుకు వీలు ఏర్పడింది. కర్నూలు–బెంగుళూరు–కర్నూలు రూట్‌లో వారానికి మూడు సర్వీసులను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేది వరకు నడిపేందుకు రూ.12 కోట్లు ప్రభుత్వం ఇండిగో సంస్థకు సాయం అందిస్తుంది. కర్నూలు–చెన్నై–కర్నూలు మధ్య వారానికి మూడు సర్వీసులను ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నడిపేందుకు రూ.12 కోట్లు ఇవ్వనుంది. కర్నూలు–విశాఖపట్టణం–కర్నూలు మధ్య ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నడిపేందుకు రూ.9 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇలా ఎయిర్‌పోర్టు నుంచి ఇండిగో సంస్థ విమాన సర్వీసులు నడిపేందుకు రూ.33 కోట్లు ఇవ్వనున్నారు.

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ రీజినల్ కనెక్టివిటీ స్కీమ్ (ఆర్‌సీఎస్–ఉడాన్)ను అమలు చేస్తోంది. ప్రాంతాల మధ్య కనెక్టివిటీ కల్పించేందుకు ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టింది. ఆర్‌సీఎస్ ఉడాన్ పథకం కింద రాష్ట్రంలో కడప, కర్నూలు విమానాశ్రయాలకు చోటు దక్కింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యాజమాన్యం కింద పని చేస్తున్న కడప ఎయిర్‌పోర్టులో 2017 ఏప్రిల్ 27 నుంచి ఉడాన్ అమలు చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కర్నూలు ఎయిర్‌పోర్టులో 2021 మార్చి 28 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2017 నవంబరు 16 నుంచి కడప–చెన్నై, 2018 మార్చి 1 నుంచి కడప–విజయవాడ, 2020 మార్చి 1 నుంచి కడప–బెల్గాంల మధ్య ఇండిగో సర్వీసులు చేపట్టింది. వీజీఎఫ్ సహకారంతో మూడేళ్లపాటు ఉడాన్ పథకాన్ని నిర్వహించారు. బెల్గాం మినహా మిగతా రూట్లలో ఇండిగో సంస్థ తమ సర్వీసులను నిలిపివేసింది. నిలిపివేసిన సర్వీసులను పునరుద్ధరించాలని కడప ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళ్లగా అందుకు అంగీకరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందుకు నడుం బిగించింది. ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను రంగంలోకి దింపింది. కడప చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ పెంచడం కోసం చర్యలు చేపట్టింది. చెన్నై–కడప, విజయవాడ–కడప మధ్య వారానికి నాలుగు సర్వీసులు నడిపేందుకు ఏటా రూ.20 కోట్లు, బెంగుళూరు–కడప, విశాఖపట్టణం–కడప రూట్లలో వారానికి మూడు ఫ్లైట్లను నడిపేందుకు రూ.15 కోట్లను కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. ఆర్‌సీఎస్ కింద 2021 మార్చి 28 నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టు ద్వారా విశాఖపట్టణం, చెన్నై, బెంగుళూరు రూట్లలో ఇండిగో సంస్థ విమాన సర్వీసులు నడుపుతోంది. మూడేళ్లపాటు వర్తించే ఉడాన్ పథకం ఈనెల 29వ తేదీతో ముగుస్తుంది. ఈనెల 28 నుంచి బెంగుళూరు సెక్టార్‌లో తమ సర్వీసులు నిర్వహించలేమని ఇండిగో సంస్థ చెప్పింది అలాగే కర్నూలు నుంచి చెన్నై, విశాఖపట్టణం రూట్లలో తిరిగే సర్వీసులు ఆగస్టు 15 నుంచి డిస్ కంటిన్యూ కానున్నాయి. కర్నూలు ప్రాంతంలో పరిశ్రమలు, ఎంటర్ ప్రెన్యూర్స్ రావడానికి ఎన్నో అవాకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త పరిశ్రమలు రావడం ప్రజల సామాజిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులను కొనసాగింపును రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత అంశంగా తీసుకుంది. ప్రయాణికుల ట్రావెల్ డేటాను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అలాగే కడప–హైదరాబాదు మధ్య సర్వీసులు నడపాలన్న డిమాండ్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో రాయలసీమ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కడప, కర్నూలు ఎయిర్‌పోర్టుల ద్వారా మరో ఏడాదిపాటు చౌక ధరలకే ప్రయాణించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.